వరికి బోనస్‌పై కాంగ్రెస్ కుట్రలు

- మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి,
- దొడ్డు వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాల్సిందే
- రైతులను మోసం చేసిన కాంగ్రెస్
- నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఆందోళనలు
- గట్టేపల్లిలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

తాండూరు రూరల్: వరి కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు

పరిగి, మే 16: వరి పంటకు బోనస్‌పై కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి విమర్శించారు. వరికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన సర్కారు ఎన్నికల తర్వాత మాట మార్చడం సరికాదన్నారు. వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని, చివరి గింజ వరకు వడ్లు కొనుగోలు చేయాలంటూ గురువారం పరిగిలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికి మద్దతు ధరతోపాటు అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల తర్వాత రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ మళ్లీ మాట మార్చడం సరైన విధానం కాదన్నారు. సన్న వడ్లకే రూ. 500 బోనస్ అని, దొడ్డు వడ్లకు ఇవ్వరాదని సర్కారు యోచించడం సబబు కాదన్నారు. రైతులు అత్యధికంగా దొడ్డు వడ్లు పండిస్తారని, అలాంటపుడు సన్న వడ్లకే బోనస్ ఇస్తామంటూ సీఎం వ్యాఖ్యానించడం చూస్తుంటే బోనస్ ఎగ్గొట్టేందుకు సర్కారు కుట్రలు పన్నుతున్నదని సందేహం కలుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పక్కన పెట్టడం కాంగ్రెస్ రివాజు అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి అయిదు నెలలు గడిచిపోయినా ఏ ఒక్క హామీ సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందని, దొడ్డు వడ్లకు సైతం రూ.500 బోనస్ ఇచ్చేంత వరకు, చివరి గింజ వరకు వడ్లు కొనుగోలు చేసేంత వరకు బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని ఆయన తెలిపారు. ప్రజా పోరాటాల ద్వారా కాంగ్రెస్ మెడలు వంచి హామీలన్నీ అమలు జరిగేందుకు ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలుస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, పరిగి, పూడూరు ఎంపీపీలు కరణం అరవిందరావు, మల్లేశం, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దోమ పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, దోమ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కె.వెంకట్‌రాంరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్, మాజీ సర్పంచ్ నల్క జగన్, కౌన్సిలర్లు బొంబాయి నాగేశ్వర్, మునీర్, ఎదిరె కృష్ణ, వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు బి.రవికుమార్, జి.రాంరెడ్డి, అబ్దుల్ బషీర్, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

తాండూరు రూరల్: ఎన్నికల ముందు రైతు వరిధాన్యం పండిస్తే రూ.500ల బోనస్ ఇస్తామని.. ఇవ్వడం లేదని, కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్ అన్నారు. గురువారం తాండూరు మండల పరిధిలోని చెంగోల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజప్ప ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బీమా, రైతు భరోసా ఇవ్వడం లేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వెంటనే బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇలాగే రైతు వ్యతిరేక విధానాలు కొనసాగిస్తే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరేందర్‌రెడ్డి, రాజప్ప, నయూం, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, మాజీ వైస్ ఎంపీపీ శేఖర్, రాకేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, శ్రీనివాసచారి ఉన్నారు.

ధారూరు: రైతులు పండించే అన్ని వడ్లకు విధిగా బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు మండల పరిధిలోని హరిదాస్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రాం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ధాన్యాన్ని పరిశీలించారు. రైతు వ్యతిరేక ప్రభుత్వ విధానాలకు నిరసనగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తెల్లారే వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని, ఎన్నికలు అయిపోయిన మరుసటి రోజే సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామంటూ మాట మార్చి రైతాంగాన్ని మరోసారి మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, సంతోష్‌కుమార్, హరిదాస్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, రాములు, విజయ్‌కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, దేవేందర్, సుధాకర్ గౌడ్, చంద్రమౌళి, బీమ్‌సేన్ చారి, రహమతుల్లా ఖాన్, పాండు, రవి, జైపాల్ రెడ్డి, మహేశ్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు. గట్టేపల్లి లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని నినాదాలు చేశారు. ఇచ్చిన హామీ మేరకు వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కంటి చూపుపై అశ్రద్ధ వద్దు..

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణుడు లయన్ హరినాథ్‌నెహ్రూ

కొడంగల్, మే 16 : కంటి చూపుపై అశ్రద్ధ వహించవద్దని, సకాలంలో వైద్యం అందిస్తే కంటి చూపు పదిలంగా ఉంటుందని కంటి వైద్య నిపుణుడు లయన్ హరినాథ్‌నెహ్రూ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ దవాఖానలో జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, లయన్ కందూరి రాంరెడ్డి కంటి ఆస్పత్రి, కొడంగల్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించిన నిపుణులు మాట్లాడుతూ..చాలా కాలం నుంచి కొడంగల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఎంతో మంది కంటి చూపు నకు భరోసాగా నిలిచినట్లు తెలిపారు. శిబిరంలో 80 మందికి పరీక్షలు నిర్వహించామని, వీరిలో 30 మందికి కంటి శుక్లాల సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరిని లయన్ కందూరి రాంరెడ్డి కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రోగులకు పండ్లు, బిస్కెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు దాసప్పయాదవ్, కటకం శివకుమార్, మురారి వశిష్ట, జయతీర్థాచారి, శ్రీనివాస్‌గౌడ్, కేవీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

బోరు ప్రారంభోత్సంలో పాల్గొన్న తండా ప్రజలు

బొంరాస్‌పేట, మే 16 : మండలంలోని మేడిచెట్టుతండాలో తాగునీటి ఎద్దడి నివారణకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక నిధులతో బోరు వేసి సింగిల్ ఫేజ్ మోటారు బిగించారు. గురువారం బోరును ప్రారంభించారు. పుష్కలంగా నీళ్లు రావడంతో తండాలో నీటి సమస్య తీరిందని తండా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీ రవినాయక్, మాజీ ఉప సర్పంచ్ శేఖర్, సంజూనాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణ దినోత్సవ ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కులకచర్ల, మే 16: గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కులకచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వాజిహుద్దీన్, మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్ అన్నారు. జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కులకచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో దోమల వ్యాధిని అరికట్టేందుకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రోడ్ల మీద, గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రం గా ఉండేలా చూసుకోవాలన్నారు.కార్యక్రమంలో వైద్యురాలు ప్రశాంతి, సీహెచ్ఎన్ స్వరూపరాణి, రత్నలత, సూపర్‌వైజర్స్ యాదమ్మ, విజయలక్ష్మి, వెంకటయ్య, రత్నమ్మ, వెంకటమ్మ, జ్యోతి, శ్రీలత, మంగమ్మ, భారతమ్మ,, జంగమ్మ, సుజాత, గౌరీ, శ్రీనివాస్, సిరాజ్, రఫీ, రాజు, మంది ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పరిగి టౌన్ , మే 16: తాగిన మైకంలో చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన ముస్తా ఫా(38) పొలంలో పత్తికట్టే తీసేందుకు బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. గురు వారం ఉదయం పొలం దగ్గర చెట్టుకు ఉరే సుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి మహ్మద్ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

కొడంగల్‌లో మోస్తరు వర్షం

కొడంగల్, మే 16: కొడంగల్‌లో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాతావరణం వేడిగా ఉండి మధ్యాహ్నం ఒక్క సారిగా చల్లబడి మోస్తారు వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురవడంతో ప్రజలు ఉక్కబోత నుంచి కొంత ఉపశమనం పొందారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

వెంకటయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న టీవీవీ నాయకులు

బొంరాస్‌పేట, మే 16 : సమాజంలో పాత్రికేయుల సేవలు ఎనలేనివని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం పొందిన బొంరాస్‌పేట ఈనాడు విలేకరి వెంకటయ్య కుటుంబాన్ని టీవీవీ నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో పాత్రికేయుల పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. మృతుని భార్య, ఇద్దరు కూతుళ్లకు అండగా ఉంటామన్నారు. నగదు సహాయం అందజేశారు. కార్యక్రమంలో టీవీవీ నాయకులు బాకారం చంద్రశేఖర్, విజయలక్ష్మి, అనిల్‌కుమార్, గౌరారం గోపాల్, రవికుమార్, ఎంఆర్‌సి కంప్యూటర్ ఆపరేటర్ మహ్మద్ గౌస్ పాల్గొన్నారు.

కళాకారులకు ఆర్థిక సాయం..

కులకచర్ల, మే 16 : మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌లో నిర్వహించనున్న నల్లపోచమ్మ వీధినాటకం పాత్రదారులకు కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకకురాలు రాజేశ్వరమ్మ రూ. ఐదు వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, విజయ్, అర్జున్, నర్సయ్య, చంద్రయ్య, అంజయ్య, మైసయ్య, రామనర్సింహులు, కిష్టయ్య, యాద య్య, నర్సింహులు, కృష్ణయ్య, సాయన్న, నర్సింహులు, వినయ్, వెంకటయ్య, రాములు, నర్సయ్య పాల్గొన్నారు.

ఇంటిపై మరణాయుధాలతో దాడి

ఏడుగురిపై కేసు నమోదు, ఐదుగురి అరెస్టు

బడంగ్‌పేట, మే 16: మీర్‌పేట పరిధిలోని లెనిన్‌నగర్‌లో నివసిస్తున్న ఓ ఇంటిని మారణాయుధాలతో దాడిచేసి బీభత్సం సృష్టించారు. ఈ దాడిలో ఏడుగురు పాల్గొన్నట్లు గుర్తించిన పోలీసులు, ఐదుగుర్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. బాధితుడు వెంకట్ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణం వద్ద పర్సనల్ సెక్యూరిటీగా పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. మీర్‌పేట ఎస్ఐ సుధాకర్ కథనం ప్రకారం.. లెనిన్ నగర్‌కు చెందిన సరిత, వెంకట్ ఇంటిపై గురువారం రఘు, సంధ్య, రాజు, లక్ష్మమ్మ, యాదమ్మ కలిసి రాళ్లు, కత్తులు, గొడ్డళ్లతో దాడి చేశారు. ఇంట్లో ఉన్న సామగ్రిని ధ్వంసం చేశారు. సీసీ కెమెరాలను కూడా ధ్వంసం చేశారు. ఈ ఘటన స్థానికంగా భయాందోళనకు గురి చేసింది. విషయం తెలిసిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగి, దర్యాప్తు చేపట్టారు. బాధితులు, దాడికి పాల్పడిన వారి నివాసాలు రెండు ఎదురెదురుగానే ఉంటాయి. అయితే, వెంకట్, సరిత కలిసి ఎదురింటి రఘును కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న రఘు కుటుంబ సభ్యులు ఏడుగురు వెంకట్ ఇంటిపై దాడి చేసి బీభత్సం సృష్టించారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. దాడికి పాల్పడిన వారిని గుర్తించి, ఏడుగురిపై హత్యాయత్నం నేరం కింద కేసు నమోదు చేశారు. వీరిలో రఘు, సంధ్య, రాజు, లక్ష్మమ్మ, యాదమ్మను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నారు. మీర్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పల్సర్ బైక్‌ను ఢీకొట్టిన కారు.. యువకుడి మృతి

కవాడిగూడ, మే 16: ట్యాంక్‌బండ్‌పై వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి పల్సర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మృతి చెందాడు. దోమలగూడ పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఎం.కార్తిక్ (21) కారు డ్రైవర్. ప్రస్తుతం కర్మన్‌ఘాట్‌లో ఉంటున్నాడు. గురువారం రాత్రి పల్సర్ బైక్‌పై యూసఫ్‌గూడ నుంచి అంబర్‌పేట వైపు వెళ్తున్నాడు. ట్యాంక్‌బండ్‌పైకి రాగానే దారితప్పి సికింద్రాబాద్ వైపు వెళ్తుండగా.. సికింద్రాబాద్ నుంచి వస్తున్న కారు ట్యాంక్‌బండ్‌పై ఉన్న విజయ ఐస్‌క్రీం పార్లర్ వద్ద ఢీ కొట్టింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాంధీ దవాఖానకు తరలించగా.. కార్తిక్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బైక్ వెనుక ఉన్న మధుకు స్వల్ప గాయాలు కావడంతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

కవాడిగూడ, మే 16: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ డి.రాజు కథనం ప్రకారం.. బన్సీలాల్‌పేట సీసీ నగర్‌లో నివాసి డే చంద్రశేఖర్ (21) హమాలీ వర్కర్. కుటుంబం కలహాలతో జీవితంపై విరక్తి చెందాడు. దీంతో అతడు సమీపంలోనే ఉన్న పెద్దన్న ఇంటికి వెళ్లి.. బుధవారం రాత్రి ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం చూసిన కుటుంబ సభ్యులు వెంటనే గాంధీనగర్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కుటుంబ కలహాలతోనే చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజు పేర్కొన్నారు.

డీసీఎం, ఆటో ఢీ.. ఆటో డ్రైవర్ మృతి

మేడ్చల్, మే 16 : డీసీఎం, ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదం మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం నివాసి ఉప్పల నాగరాజు గురువారం మేడ్చల్ ప్రాంతానికి ట్రాలీ ఆటో తీసుకొని వచ్చాడు. పని ముగించుకొని తిరిగి మేడ్చల్ చెక్‌పోస్ట్ మీదుగా గండిమైసమ్మ దారిలో వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన డీసీఎం ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో ముందు భాగం పూర్తిగా ధ్వంసమై, డ్రైవర్ నాగరాజు ఇరుక్కుపోయాడు. స్థానికులు, వాహనదారులు శ్రమించి, అతడిని బయటకు తీశారు. అయితే, తీవ్రంగా గాయపడ్డ అతడు కొద్ది సమయానికి మృతి చెందాడు. ప్రమాద ఘటనతో ట్రాఫిక్ స్తంభించింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

దంచి కొట్టిన వాన...

ధారూరు, మే 16: ధారూరు మండలంలో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీగా వర్షం కురిసింది. మండల పరిధిలోని నాగారం, ధారూరు, మైలారం, గురుదోట్ల, దోర్నాల్, తరిగోపుల, రాజాపూర్, గట్టేపల్లి, కేరెళ్లి, చింతకుంట, తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. నాగారం గ్రామపరిధిలో భారీ వర్షం కురవడంతో వరి కొనుగోలు కేంద్రం వద్ద ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్ద అయింది. కొన్ని గ్రామాల్లో పంట పొలాలు నీటితో నిండిపోయాయి.

ఇంకుడు గుంతల నిర్మాణంపై

ఫ్లంబర్లకు శిక్షణ

సిటీబ్యూరో, మే 16 (నమస్తే తెలంగాణ): ఇంకుడు గుంతల నిర్మాణంపై ఫ్లంబర్లకు జలమండలి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. జూబ్లీహిల్స్‌లోని రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ థీమ్ పార్కులో గురువారం జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో 30 మంది పాల్గొని, శిక్షణ పొందారు. జలమండలి, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, సీడీఎంఏ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణంపై శిక్షణ ఇస్తున్నామని, గత నెలలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా శిక్షణ పొందారని, ఇంకుడు గుంతల ప్రత్యేకాధికారి జాలా సత్యనారాయణ తెలిపారు. ఇంకుడు గుంతల నిర్మాణం, ప్రాముఖ్యం, విలువను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించామన్నారు. ప్లంబర్లు పనికి వెళ్లిన ప్రదేశంలో అక్కడ ఇంకుడు గుంత లేకపోతే.. ముందుగా ఇంకుడు గుంత గురించి వివరించి.. ఆ తర్వాతే పనిచేస్తామంటూ.. ఈ సందర్భంగా ప్లంబర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

కారును ఢీకొన్న బస్సు..

బేగంపేట్, మే 16: బేగంపేట ఫ్లై ఓవర్‌పై గురువారం ఉదయం వేగంగా దూసుకొచ్చిన బస్సు కారును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గురువారం ఉదయం 7 గంటల సమయంలో అమీర్‌పేట వైపు నుంచి బేగంపేట ఫ్లై ఓవర్ మీదుగా సికింద్రాబాద్ వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన ఓ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంతో ఫ్లై ఓవర్‌పై వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను తరలించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ప్రమాదంలో కారు దెబ్బతిన్నది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు కూడా స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఓట్ల ఈవీఎంలను భద్రపర్చిన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూమ్‌లు, బందోబస్తును అదనపు చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి లోకేశ్ కుమార్, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి గౌతమ్ పాత్రులు పరిశీలించారు. ఎన్నికల ఫలితాలు వెలువడేవరకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారుల వెంట ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, ఏఆర్ఓ పంకజ పాల్గొన్నారు. – ఎల్బీనగర్ , మే 16

బూటు విసిరింది ఫసియుద్దీనే..

సీపీకి, బోరబండ పోలీసులకు

బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు..

జూబ్లీహిల్స్, మే16: బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ రోడ్‌షోపై బూటు విసిరింది కార్పొరేటర్ బాబా ఫసియుద్దీనేనని బీఆర్ఎస్ నేతలు నగర పోలీసు కమిషనర్‌కు, బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 9న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బోరబండ సైట్-3 కాలనీలోని హైటెక్ హోటల్ మీదుగా రోడ్‌షోగా వెళ్తుండగా దాడి జరిగింది. ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ నేతలు సాక్ష్యాలను, వీడియోలను పోలీసులు అందజేశారు. బోరబండ పోలీసులు ఈ ఘటనలో బాబాఫసియుద్దీన్ విసిరిన షూ స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేట్టారు

మల్కాజిగిరి కార్పొరేటర్ అరెస్టు..!

రిగ్గింగ్ పేరుతో వీడియో వైరల్

సీసీఎస్ సైబర్‌క్రైమ్ ఠాణాలో కేసు

మల్కాజిగిరి, మే 16: మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్‌ను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. అయితే, బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారంటూ సోషల్ మీడియాలో హల్‌చల్ అయ్యింది. ఈ వివరాలిలా ఉన్నాయి.. విష్ణుపురికాలనీలో ఉన్న కార్పొరేటర్ శ్రవణ్ కార్యాలయానికి సాయంత్రం 6 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చా రు. కార్యాలయంలోకి వెళ్లి బలవంతంగా శ్రవణ్‌ను బయటకు తీసుకొచ్చి, వాహనంలో ఎక్కించుకొని వెళ్లారు. ఈ దృశ్యం సీసీ కెమెరా విజువల్స్ ద్వారా బయటకు వచ్చింది. ఆ విజువల్స్ చూసిన ప్రజలు శ్రవణ్ కిడ్నాప్ నిజమేనని భావించారు. అయితే, చివరకు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవల సోషల్ మీడియాలో బహదూర్‌పురాకు చెందిన ఒక పోలింగ్ బూత్‌లో రిగ్గింగ్ జరుగుతున్నదనే ఒక వీడియోను సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అది ఇక్కడిది కాదని, దానిని ఉద్దేశపూర్వకంగానే శ్రవణ్, మరికొందరు కలిసి వైరల్ చేసినట్లు తేలడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దీనిపై అధికారులు ఇంకా స్పందించలేదు.



కుళ్లిపోయిన చికెన్!

కాలం చెల్లిన ఆహార పదార్థాలు

జూబ్లీహిల్స్‌లో బార్, పబ్ నిర్వాహకులపై ఫుడ్ సేఫ్టీ అధికారుల చర్యలు

సిటీబ్యూరో, మే 16, (నమస్తే తెలంగాణ): ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని పలు పబ్, హోటల్ నిర్